విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 02, సెప్టెంబర్ 2025

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర - శిరివెళ్ల : భగవాన్ శ్రీ సత్య సాయి బాబా శతజయంతి వేడుకల సందర్భంగా శిరివెళ్ల గ్రామంలో ఆనంద్ కుమార్ శ్యాం సుందర్ లాల్ ఆధ్వర్యంలో ఉదయానంద్ హాస్పిటల్ నుండి డాక్టర్ సౌమ్య రెడ్డి పర్యవేక్షణలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరము ఏర్పాటు చేశారు . ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది.సుమారు 155 మంది పలు రకాల కంటి చూపు సమస్యలతో బాధపడుతూ 155 మంది హాజరుకాగా వీరిలో 30 మందికి శుక్ల ఆపరేషన్ కు ఎంపిక చేసినట్లు డాక్టర్ సౌమ్య రెడ్డి తెలిపారు. ఈ నెల 3, 4 తేదీల్లో ఆపరేషన్ చేసి డిశ్చార్జ్ చేయడం జరుగుతుందిని తెలిపారు. ఇతర కంటి సమస్యలు ఉన్న వారిని బుధవారం ఉదయానంద హాస్పిటల్‌కు వచ్చినయెడల వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలు, మందులు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆనంద్ గురూజీ మాట్లాడుతూ శిరివెళ్ల గ్రామంలో పుట్టి పెరిగినందుకు గ్రామం రుణం తీర్చుకునేందుకు మానవత్వ సేవ చేసుకునే అవకాశాన్ని ప్రజలు కల్పించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉల్లి నాగేశ్వరుడు, అశోక్, సురా, పెద్దన్న, మందుల సురేష్, చైతన్య, సురేంద్ర పాల్గొన్నారు.

పదవీ విరమణ ప్రతి ఉద్యోగికి తప్పనిసరి

విశాలాంధ్ర - వెలుగోడు : పట్టణంలోని శ్రీ శక్తి భవన్‌లో వెలుగు సిసిగా పని చేస్తున్న సుగుణపాల్ పదవి విరమణ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఆదివారం ఆయనకు ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఆత్మకూరు క్లస్టర్ ఏపిఎం పుల్లయ్య, సీసీలు, వెలుగోడు ఏపిఎం, విఓఎలు, ఎల్‌సిలు, మహిళా సంఘము ప్రెసిడెంట్, ఎంఎస్‌ఎలు హాజరు కావడం జరిగింది. వారు మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి పదవి విరమణ తప్పనిసరి అని, అయితే తాను సంతృప్తిగా పని చేశానా, లేదా అని గుర్తించుకోవాలని అన్నారు. సుగుణపాల్ చేసిన సేవలను అందరూ గుర్తు చేసుకున్నారు.

కళాశాల ప్రిన్సిపాల్‌గా రాజశేఖర్ రెడ్డి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ: పట్టణంలోని ఎద్దుల పాపమ్మ ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన ప్రిన్సిపల్‌గా రాజశేఖర్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఆయనకు శాలువా, పూలమాలతో సత్కారం చేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రిన్సిపాల్ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ కళాశాలలో విద్యాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.

ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్‌లు పంపిణీ చేసిన మంత్రి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: పట్టణ 8వ వార్డు సచివాలయం పరిధిలో టిడిపి ఇంచార్జీ ఉప్పరి సుబ్రహ్మణ్యం, క్లస్టర్ ఇంచార్జ్ ఉప్పరి సురేష్ కుమార్ ఆధ్వర్యంలో రాష్ట్ర న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి పింఛన్ అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ పింఛన్ పంపిణీ చేసినప్పుడు లబ్ధిదారుల కళ్ళల్లో ఆనందం కనిపించిందన్నారు. ప్రతినెల 1వ తేదీనే పింఛన్ ఇవ్వడం జరుగుతుందని, ఒకటో తేదీ ఆదివారం వస్తే 31వ తేదీనే వారికి పింఛన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం టిడిపి అభిమాని ఫిరోజ్ (గాంధీ) పింఛన్ లబ్ధిదారులకు అల్పాహార విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ శేషన్న, పిడి వెంకటదాస్, పసుపులేటి నారాయణ,మాజీ కౌన్సిలర్ రవికుమార్, బింగుమల్లె శ్యామ్ సుందర్ గుప్తా, మైమూన్, వార్డు ఇంచార్జీలు షేక్ మున్నా, ఎబినేజర్, టీడీపీ నాయకులు నాగేశ్వర రావు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

విశాలాంధ్ర - బనగానపల్లె: ప్రజా సమస్యల పరిష్కారం కోసం వచ్చే దరఖాస్తులను రెవిన్యూ సిబ్బంది, వీఆర్వోలు పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని మండల తాహసీల్దార్ నారాయణ రెడ్డి సూచించారు. సోమవారం నాడు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్య పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు రైతులు నుంచి వచ్చిన అర్జీలను తాహసిల్దార్ నారాయణరెడ్డి స్వీకరించారు. మండల స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖర్ రెడ్డి, ఏఈ నాగరాజు, పంచాయతీరాజ్ ఏఈ వెంకటరమణ, విద్యుత్ రూరల్ ఏఈ గజప్ప, మండల విద్యాధికారి స్వరూప-1 శ్రీనివాసులు-2 ఏటీఎం హజరత్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సాయి కృష్ణ వెటర్ని డాక్టర్ బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలతో సూపర్ హిట్

విశాలాంధ్ర - వెలుగోడు : కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తూ సూపర్ హిట్ కొట్టిందని శ్రీశైలం శాసన సభ్యులు బుడ్డా రాజశేఖర రెడ్డి అన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు ఉమ్మడి ఏపి ముఖ్యమంత్రిగా మొట్టమొదటిసారి ప్రమాణ స్వీకారం చేసి 30 ఏళ్లు పూర్తి చేసుకున్న శుభసందర్భాన్ని పురస్కరించుకొని వెలుగోడు బంగ్లా ఆవరణంలో కూటమి నాయకులు వేడుకలు చేసుకున్నారు.ముఖ్యఅతిథిగా హాజరై భారీ కేక్ ను ఎమ్మెల్యే కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ 30 ఏళ్లుగా సంపద సృష్టి, సంస్కరణలు, దార్శనికత, అభివృద్ధి, ఆత్మవిశ్వాసం అన్న పదాలకు నిర్వచనంగా చంద్రబాబు నాయుడు నిలిచి తెలుగు జాతి ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తం చేసారని అన్నారు. దేశాధినేతలు, ప్రజలందరూ మెచ్చిన నాయకుడు చంద్రబాబు, దేశంలో ఐటీ విప్లవం, సైబరాబాద్ అభివృద్ధితో యువతకు భవిష్యత్తునిచ్చారన్నారు.

ఆర్మీ జవాన్ పదవి విరమణ, గ్రామస్తుల సంబరం

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్ : మండల పరిధిలోని నల్ల కాలువ గ్రామానికి చెందిన వడితి రెడ్డి నాగేశ్వర్ రెడ్డి భారతదేశం పట్ల నిబద్ధతతో దేశ రక్షణకై 2005 మార్చ్ 9వ తేదీన భారత సైనిక సిపాయిగా బాధ్యతలు చేపట్టి దేశం కోసం 2014లో లాన్స్ నాయక్‌గా, 2015లో నాయక్ గా,2017లో లాన్స్ హవల్దార్గా, 2020లో హవాలాదారుగా, పదవినోతులు పొంది దేశ రక్షణకై ఎంత గానో శ్రమించి భారత సైన్యానికి ఎనలేని సేవను అందించి పదవి విరమణ పొంది తమ స్వగ్రామమైన నల్ల కాలువ గ్రామం చేరగా తమ బంధు మిత్రులు గ్రామస్తులు అందరూ కలిసి గత 20 ఏళగా ఆయన దేశం కోసం సేవను అందించినందుకు ఎంతగానో గర్వంగా ఉందని, భారత దేశంలో పుట్టిన ప్రతి పౌరుడు ఈ బాధ్యతలకు కట్టుబడి దేశ రక్షణకై వెళ్లాలని దేశం సౌభిక్షంగా ఉండాలంటే అది ప్రతి పౌరుని బాధ్యతగా దేశ రక్షణ వెళ్లాలన్నారు. అనంతరం గ్రామస్తులు అందరూ కలిసి ఆయనకు, ఆయన సతీమణికి పూలదండలతో సత్కరించడం జరిగింది.

యాగంటి ఉమామహేశ్వరలకు పల్లకి సేవ

విశాలాంధ్ర - బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమా మహేశ్వరస్వామి ఆలయం లో సోమవారం స్వామివారి పల్లకీ సేవ ఘనంగా జరిగింది. ఆలయంలో కొలువైన ఉమామహేశ్వర స్వామికి ఉదయం అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కొలువుదీర్చి పల్లకీ సేవ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి పాండురంగారెడ్డి, యాగంటి పల్లె మౌళిశ్వర రెడ్డి, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

మీట్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా చాగలమర్రివాసి

విశాలాంధ్ర - చాగలమర్రి : కూటమి ప్రభుత్వం ప్రకటించిన మీట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరుగా చాగలమర్రి వాసి ఎన్నికయ్యారు. చాగలమర్రికి చెందిన భూమా వర్గం అనుచరుడు, చాగలమర్రి టిడిపి నాయకుడు అన్సర్‌బాష ప్రధాన అనుచరుడు ముల్లా ఆజిమొద్దీన్ ఎన్నికయ్యాడు. రాష్ట్ర డైరెక్టరు పదవికి ఎన్నికకు కృషి చేసిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, ఆళ్లగడ్డ టిడిపి నాయకులు భార్గవ్‌రామ్,భూమా జగత్ విఖ్యాత్ రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తనను నమ్మి అప్పగించిన బాధ్యతలు సక్రమంగా నిర్వర్తిసానన్నారు.

ఎస్సీ, ఎస్టీ వార్డులకు సబ్ ప్లాన్ నిధులు విడుదల చేయాలి

విశాలాంధ్ర-డోన్: పట్టణంలో మునిసిపాలిటీలో ఉన్న నాలుగు ఎస్సి వార్డులకు 16, 17, 15, 3 వార్డులు 28వ ఎస్టి వార్డుకు ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు విడుదల చేయాలని సోమవారం పీజీఆర్ఎస్ ప్రోగ్రాంలో జిల్లా కలెక్టర్ రాజకుమారికి డోన్ సీపీఐ 16వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ పి.సుంకయ్య వినతి పత్రం అందజేశారు. స్పందించిన కలెక్టర్ ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల గురించి రాష్ట్రస్థాయి కమిషనర్‌కు మీరిచ్చిన అర్జీ విషయమై పరిష్కారానికి వెంటనే పంపి ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు విడుదల చేయడానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ మున్సిపల్ కౌన్సిలర్ మాట్లాడుతూ 2019 నుండి 2025 వరకు ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు విడుదల చేయలేదని, అనేకసార్లు మున్సిపల్ కౌన్సిల్లో ప్రస్తావించినా కూడా ప్రయోజనం లేదన్నారు. అణగారిన వెనుకబడ్డ ఎస్సీ ఎస్టీ వార్డులు అభివృద్ధి కోసం ప్రజల మౌలిక వసతుల కోసం ప్రధానంగా ప్రధాన వార్డులోని మసీదు వెనుక భాగం త్రివర్ణ కాలనీ హెూసన్న మందిర్ వీడియోస్ కాలనీ సర్వోత్తమ రెడ్డి కాలనీ బ్రాండ్స్ కాలనీ బ్రాండ్స్ కాలనీ డిగ్రీ కాలేజీ ప్రభుత్వ హాస్పిటల్ వరకు సిసి రోడ్లు కాలువలు వీధిలైట్ల ఏర్పాటు కోసం కరెంటు స్తంభాలు ఇవి పరిష్కారం కాలేదన్నారు. పరిష్కారం కావాలను కుంటే 14 ఫైనాన్స్ నిధులు కనీసం పిల్ల కాలువలు ఏర్పాటు చేయలేకపోయామని చట్టబద్ధంగా ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు ఉన్నా సరే వాటిని విడుదల చేయడంలో గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింద న్నారు. కనీసం ఇప్పటి ప్రభుత్వమైన ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు విడుదల చేసి వార్డుల అభివృద్ధి వార్డుల మౌలిక వసతుల కోసం ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు వెంటనే విడుదల చేయాలని కోరారు.

స్థానిక పరిశ్రమలల్లో యువతకు ఉద్యోగాలు ఇవ్వాలి

విశాలాంధ్ర -డోన్: స్థానిక పరిశ్రమలల్లో యువతకు ఉద్యోగాలు ఇవ్వాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి రణత్ యాదవ్ అన్నారు. నియోజవర్గం స్థానిక పరిశ్రమల్లో స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగం ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతూ సోమవారం డోన్ లో కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డోన్ నియోజవర్గంలో ఉన్న ప్రియా సిమెంట్ ఫ్యాక్టరీ, పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీలు డోన్ నియోజవర్గంలో ఉన్నటువంటి స్థానిక ఖనిజ సంపదను సహజ వనరులను ఉపయోగించుకుంటూ, రాష్ట్ర ప్రభుత్వం చేత రాయితీలు పొందుతూ, కోట్ల రూపాయలు లాభాన్ని పొందుతున్న ఈ పరిశ్రమలు స్థానిక యువతకు ఉద్యోగ పాద అవకాశాలు కల్పించలేదన్నారు. అతి ఆశతో ఇంకా లాభాలు అర్జించాలని పక్క రాష్ట్రాల యువతకు తక్కువ వేతనాలు ఇస్తూ వారితో పని చేయించుకుంటున్నరన్నారు. దీనివల్ల స్థానిక నిరుద్యోగ యువత ఉద్యోగం ఉపాధి అవకాశాలులేకపోతున్నరన్నారు. తక్షణమే ఈ సమస్యకు పరిష్కారం చూపించాలని స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగులు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు.

పేరంటాలమ్మ గుడి దగ్గర స్థల లబ్ధిదారులకు ఇల్లు నిర్మించుకోవడానికి అనుమతి ఇవ్వాలి

విశాలాంధ్ర-డోన్: పట్టణ శివారులోని పేరంటాలమ్మ గుడి దగ్గర ఇంటి స్థలాల పట్టాల లబ్ధిదారులకు ఇల్లు నిర్మించుకోవడానికి అనుమతి ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.సుంకయ్య, పట్టణ కార్యదర్శి మోట రాముడు కోరారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన నంద్యాల జిల్లా కలెక్టర్ రాజ కుమారికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1998లో పట్టణ శివారులో ఇల్లు లేని పేద ప్రజలకు అప్పటి ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసిందని, అప్పుడు పట్టణానికి సుదూర ప్రాంతంగా ఎలాంటి మౌలిక వసతులు లేనందున పట్టాల లబ్ధిదారులు ఇల్లు నిర్మించుకోలేదన్నారు. అనంతరం ఆ స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని అన్నారు. మళ్లీ 2013లో లబ్ధిదారులందరూ సీపీఐ ఆధ్వర్యంలో అనేకమార్లు ధర్నాలు ఆందోళనలు నిర్వహించడం జరిగిందని వారు తెలిపారు. అయినా అప్పటి అధికారులు స్పందించకపోవడంతో చివరగా భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ ఆధ్వర్యంలో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి అక్కడున్న స్థలాల లబ్ధిదారులకు పట్టాలు అప్పుడున్న కలెక్టర్ ఆదేశాల మేరకు పంపిణీ చేయడం జరిగిందని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ డోన్ పట్టణ సహాయ కార్యదర్శులు ఎన్‌కె రామ మోహన్, ఎం.పుల్లయ్య, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు రణత్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రతాప్, ఏపీ మహిళా సమాఖ్య డోన్ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీదేవి, అమృత రెడ్డి, మాధవి,హసీనా, ఏఐటీయూసీ కార్యదర్శి అబ్బాస్, ఏఐవైఎఫ్ డోన్ పట్టణ మండల అధ్యక్షులు రజాక్, మౌళి, హరికృష్ణ, నాయకులు శేఖర్ తదితరులు పాల్గొన్నారు

మన గ్రోమర్ సెంటర్‌ను తనిఖీ చేసిన తహసీల్దార్

విశాలాంధ్ర - పాములపాడు : మండల కేంద్రంలోని మన గ్రామ సెంటర్‌ను, లక్ష్మీ వెంకటేశ్వర ఫర్టిలైజర్ షాపును సోమవారం తహసీల్దార్ సుభద్రమ్మ మండల వ్యవసాయ అధికారి మహేశ్వర్ రెడ్డి తనిఖీ చేశారు. ముందుగా లైసెన్సులను స్టాక్ రిపోర్ట్‌లను బిల్లులను ఈపాస్ స్టాక్‌ను పరిశీలించారు. అనంతరం ఫర్టిలైజర్ నిల్వ ఉంచిన గోడౌన్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూరియా కొరత కారణంగా అనధికారికంగా నిల్వ ఉంచి బ్లాక్ మార్కెట్లో అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం నిబంధనల ప్రకారం వాటిని విక్రయించాలని అక్రమాలకు పాల్పడితే లైసెన్స్ రద్దు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. వీఆర్వో శివన్న వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘాట్ రోడ్డు వెడల్పు చేయాలి

విశాలాంధ్ర - డోన్: ఘాట్ రోడ్డు వెడల్పు చేయాలని సీపీఐ నాయకులు కోరారు. సీపీఐ నాయకులు సోమవారం జరిగిన ప్రజా దర్బార్ వేదికలో కలెక్టర్‌కి వినతి పత్రం సమర్పించారు. యాగంటి నుంచి మద్దిలేటి స్వామి దేవస్థానానికి వెళ్లే మార్గంలో రోడ్డు ఇరుకుగా ఉండటం వలన ప్రమాదాలు జరుగు తున్నాయి. యాగంటి నుండి ఫతేనగర్ రోడ్డు మార్గంలో ప్రమాదాలు నివారించాలంటే రోడ్డు మార్గాన్ని వెడల్పు చేయాలని తెలిపారు. రెండు రోజుల కిందట జరిగిన ఆటో ప్రమాదంలో ఒక మహిళ మృతి చెంది ఒదని, అంతకంటే ముందు ఘాట్ రోడ్డులో ఉన్న ప్రహరీ గోడ పడిపో యిందన్నారు. ప్రమాదాలు ఎక్కువగా సంభవించే అవకాశం ఉండటం వలన త్వరగా చర్యలు తీసుకోవాలని సీపీఐ తరపున కలెక్టర్‌కి ప్రజా దర్బార్ వేదికలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్య దర్శి శివయ్య, సిపిఐ జిల్లా సమితి సభ్యులు సుబ్బారెడ్డి, ఫతేనగరం, కటికవాని కుంట ప్రజలు పాల్గొన్నారు.

స్మశాన వాటిక ముళ్ళ కంప తొలగింపు

విశాలాంధ్ర - బనగానపల్లె: మండల పరిధిలోని మిట్టపల్లె గ్రామంలో గల హిందూ స్మశాన వాటిక, ముళ్ళ కంప పెరగడం, ఆక్రమణలకు గురికావడంతో గ్రామ ప్రజల కోరిక మేరకు సోమవారం నాడు గ్రామ సర్పంచ్ యడమ కంటి తులసి రెడ్డి భూమి పూజ చేసి జెసిబి సహాయంతో ముళ్ళ పొదలు, కంపచెట్లు, ఆక్రమణలు తొలగించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. వి.రామసుబ్బారెడ్డి, ఎన్ రామ సుబ్బారెడ్డి, హుస్సేన్ రెడ్డి, దేవసాయం గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కళారాధన ఆధ్వర్యంలో మాతృభూమికి కళార్చన సాంస్కృతిక పోటీలు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: కళారాధన ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్, ఐఎంఏ సంయుక్త నిర్వహణలో రాష్ట్ర సృజనాత్మక సంస్కృతి కమిషన్ సాంస్కృతిక శాఖ సహకారంతో ప్రతి ఏటా గత 24 ఏళ్లుగా నిర్వహించే మాతృభూమికి కళార్చన పోటీలు సోమవారం రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో ప్రారంభమయ్యాయి. కళారాధన అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు అధ్యక్షతన, ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవికృష్ణ నిర్వహణలో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పోటీలను ప్రారంభించారు. సందర్భంగా డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కళారాధన సాంస్కృతిక సంస్థ గత 25 ఏళ్లుగా విద్యార్థులలో దేశభక్తి భావాలను పెంపొందించే దిశలో వారిలోని సృజనాత్మకతను ప్రోత్సహించే విధంగా అనేక రకాల పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కళారాధన అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ ఈ పోటీలను ఈ సంవత్సరం కళారాధన రజతోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. వేసవిలో కళాసాధన లలిత కళల వేసవి శిక్షణ శిబిరం నిర్వహించామని, ఇప్పుడు మాతృభూమి కళార్చన పోటీలు ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కళారాధన కార్యనిర్వాహక కార్యదర్శులు రవిప్రకాష్, రంగనాథ్, గౌరవ సలహాదారు చిత్తలూరి రాంప్రసాద్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు, జోన్ చైర్మన్ నిజాముద్దీన్, కార్యదర్శి తాతిరెడ్డి భాస్కర్ రెడ్డి, కోశాధికారి అమిదేల జనార్ధన్, కళారాధన సహాయ కార్యదర్శి నాగేంద్ర, కార్యాలయాలు కార్యదర్శులు వెంకటేశ్వర్లు, సూర్య, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమమే టీడీపీ ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ: మహిళల సంక్షేమమే టిడిపి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ అన్నారు. స్త్రీ శక్తి కార్యక్రమంలో భాగంగా సోమవారం సాయంత్రం మహిళలతో నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ పాల్గొన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి మార్కెట్ యార్డ్ వరకు పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలల్లో భాగంగా ఇచ్చిన మరో పెద్ద వరం రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అన్నారు. చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ప్రకారం మహిళలందరికీ తల్లికి వందనం, ఉచిత బస్సు, సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు అమలు చేశారన్నారు. మహిళలు ఎవరు ఇబ్బందులు పడకూడదని మహిళల కోసం ఎన్నో పథకాలను పరిశ్రమలను తెప్పించి సంతోషంగా ఉండేలాగా చేసే ఏకైక ప్రభుత్వం తెలుగుదేశ ప్రభుత్వమని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. గత ఐదు సంవత్సరాలు వైసీపీ ప్రభుత్వంలో మహిళలు చాలా ఇబ్బందులు పడ్డారని, పెరిగిన ధరలతో ఇబ్బందులకు గురయ్యారని ఈ ప్రభుత్వం అలా కాదని చంద్రబాబు నాయుడు ప్రతి ఒక్కరూ బాగుపడేలాగా చూసుకుంటారన్నారు. ఆళ్లగడ్డలో డ్వాక్రా మహిళలు ఎంతో ఉపాధి పొందుతున్నా రన్నారు. ఆళ్లగడ్డలో త్వరలోనే ఎక్కువ పరిశ్రమలు తెప్పించి ప్రతి ఒక కుటుంబానికి నెలకు రూ.50 వేలు సంపాదించుకునేలా చేస్తానన్నారు. అనంతరం ఎమ్మెల్యే పోస్టర్ని లాంచ్ చేశారు. భూమా కుటుంబం జీవితమంతా ప్రజల కోసమే అంకితమని గతంలో తమ నాన్న, తమ పెదనాన్న, తమ అమ్మ అందరూ ప్రజల కోసమే పనిచేశారని, ఇప్పుడు తాము చేస్తున్నామని, రాబోయే రోజుల్లో పని చేస్తారని ఎమ్మెల్యే తెలిపారు.

యువ కవికి ఘన సన్మానం : బీసీ రాజారెడ్డి

విశాలాంధ్ర - బనగానపల్లె: పట్టణం కొండపేటకు చెందిన యువ కవి కుమారస్వామి సుధీర్ బాబును పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి తన కార్యాలయంలో సోమవారం నాడు ఘనంగా సన్మానించారు. ప్రముఖ సినీ కవి, గేయ రచయిత, విమర్శకులు ఆరుద్ర శతజయంతి వేడుకలను పురస్కరించుకొని యువ కవి సుధీర్ బాబుకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బిసి రాజారెడ్డి సుధీర్ బాబుకు శాలువా కప్పి పూలమాలవేసి మెమెంటోను బహుకరించి సత్కరించారు. సుధీర్ బాబు ఇప్పటివరకు మూడు వేలకు పైగా కవితలు రాసి ఎంతో మంది మన్ననలు చూరగొన్నారన్నారు. తెలుగు తేజం, సుకవి అనే అవార్డులు సొంతం చేసుకోవడంతో పాటు హైదరాబాదులోని రవీంద్ర భారతిలో రెండు సార్లు సన్మానం పొందిన ఘనత సుధీర్ బాబుది అని గుర్తు చేశారు. కవులు, కళాకారులకు తన వంతు ప్రోత్సాహం ఎల్లవేళలా అందిస్తూనే ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బనగానపల్లె పట్టణ ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎస్.విజయ్ కుమార్, భగవద్గీత ప్రచారకులు రామశేషయ్య, జ్యోతిష్కులు వెంకటరాముడు, రోటరీ క్లబ్ మెంబర్ బలరామయ్య, మహేశ్వర్ రెడ్డి, శంకర్, భరతుడు పాల్గొన్నారు.

మన చేతుల్లోనే మన డబ్బు.. మన లెక్కలు

విశాలాంధ్ర- కోవెలకుంట్ల: పొదుపు సంఘాలలో లావాదేవీలను మన డబ్బు, మన లెక్కల యాప్ ద్వారా ఎప్పటికప్పుడు గ్రూపు సభ్యులు తెలుసుకునే అవకాశం ఉందని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ హనుమా నాయక్ అన్నారు. సోమవారం స్థానిక పొదుపు భవనంలో మన డబ్బు మన లెక్కలనే ప్రోగ్రాంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమంలో కోయిలకుంట్ల సెక్టార్‌లోని ఏడు మండలాలకు చెందిన వెలుగు సీసీలు ఎంహెచ్‌ఏలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పొదుపు సంఘాలలో రికవరీ సమయంలో నిధులు జమ చేసేటప్పుడు అవకతవకలు జరుగుతుండడంతో వాటి అన్నిటినీ అరికట్టేందుకు ప్రభుత్వం నూతన యాప్ ను తీసుకు రావడం జరిగింది. ఈ యాప్ ద్వారా సభ్యులు వారి కొరకు పొదుపు అప్పు తదితర వివరాలు మొబైల్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు వాటి వివరాలు లబ్ధిదారులు అనేదానిపై ఎప్పటికప్పుడు సమాచారం పొందవచ్చు అన్నారు. ఏపీఎం ఐబి పుణ్యవతి, ఏబీఎన్ బ్యాంకు లింకేజ్ సభ్యులు ఎల్లయ్య, ఏపీ మీ ఎల్ హెచ్ బాబు, ఎస్సీలు రవి, భాష, ఏపిఎం శేఖర్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం పనులను పర్యవేక్షించిన టీడీపీ కన్వీనర్

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల పరిధిలోని బోయలకుంట్ల గ్రామంలోని పలు వార్డులలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను మండల టిడిపి కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి పర్యవేక్షించారు. డ్రైనేజీ తొలగింపు చెత్త చెదారం ఏరివేత మురికి నీటి నిలువలను నిర్మూలించుట తదితర పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని గ్రామపంచాయతీ కార్యదర్శి అన్నారు. ఈ సందర్భంగా కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ డ్రైనేజీ కాలువల్లో చెత్తాచెదారం వేయకుండా నివాస ప్రాంత ప్రజలు సహకరించాలని కోరారు. డ్రైనేజీ కాలువల్లో ఆటంకం లేకుంటే మురికి నీటినిలువ ఉండదని దుర్వాసన లేకుండా దోమలు ఉత్పత్తి జరగకుండా అరికట్టవచ్చని తెలియజేశారు. గ్రామ ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే తమ లక్ష్యమని పరిసరాల పరిశుభ్రతకు వ్యక్తిగత శుభ్రతకు ప్రతి కుటుంబం కట్టుబడి ఉండాలని వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రభలకుండా ఉండేందుకు గ్రామ ప్రజలు సురక్షితమైన నీరు శుభ్రమైన ఆహారం తీసుకుంటూ ఆరోగ్య మేలుకువలు పాటించాలని మండల టిడిపి కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి సూచించారు.

పింఛన్ ఇప్పించండి సార్

- మృతి చెందిన భర్త స్థానంలో ఇవ్వాలని వితంతు మహిళా వేడుకోలు
- మూడేళ్లుగా కరుణించని అధికారులు
- వితంతు మహిళా మృతి చెందినట్లు నాడే రికార్డ్‌లో నమోదు డిజిటల్ వెల్ఫేర్‌పై ఆరోపణలు

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మండలంలోని గోరుమాను పల్లి గ్రామానికి చెందిన మూలే రాజమ్మ మృతి చెందిన తన భర్త స్థానంలో వితంతు పింఛన్ ఇప్పించాలంటూ మూడేళ్లులుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా అధికారులు కరుణించడం లేదు. కంట పడిన ప్రతి అధికారిని తనకు పింఛన్ ఇప్పించాలంటూ వేడుకుంటున్నది. మృతి చెందిన తన భర్తతోపాటు తాను మృతి చెంది ట్లుగా రికార్డులలో గ్రామ డిజిటల్ వెల్ఫేర్ నమోదు చేయడంతోనే దుస్థితి ఎదురైనట్లు ఆమె తెలిపారు. గ్రామానికి చెందిన జయరామిరెడ్డి భార్య రాజమ్మ తన గోడును ఎవరు పట్టించుకోవడంలేదని ఆవేదన చెందుతున్నది. వృద్ధాప్య పింఛను పొందుతున్న జయరామి రెడ్డి మూడేళ్ల కిందట మృతి చెందడంతో రాజమ్మ వితంతు పింఛన్‌కు దరఖాస్తు గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసింది. డిజిటల్ వెల్ఫేర్ మృతి చెందిన భర్త పింఛను తొలగించి అదే సమయంలో రాజమ్మ కూడా మృతి చెందినట్లు నమోదు చేశారు. దీంతో రాజమ్మకు పింఛన్ కష్టాలు మొదలయ్యాయి. ఎన్నిసార్లు సచివాలయానికి వెళ్ళిన అధికారులు అసలు విషయం దాచిపెట్టి రేపు మాపు అంటూ మభ్య పెడుతున్నట్లు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. మూడు సంవత్సరాలుగా వితంతు పింఛన్ రాక రాజమ్మ కష్టాలు మరింతగా పెరిగాయి. రాజమ్మ కష్టాన్ని ఇటీవల తెలుసుకున్న గ్రామ ఎంపీటీసీ పులి ప్రకాష్ రెడ్డి జిల్లా డిఆర్డిఏ ఆఫీస్ కి వెళ్లి అధికారులకు విషయాన్ని తెలియజేశారు. రాజమ్మ కూడా చనిపోయినట్లు ఆన్లైన్లో డిజిటల్ వెల్ఫేర్ నమోదు చేయడంతోనే పింఛన్ రాలేదని అధికారులు తేల్చేశారు. ప్రస్తుత సంవత్సరం జనవరి 1వ తేదీకి 60 సంవత్సరాలు పూర్తి కావడంతో వృద్ధాప్య పింఛన్కు అర్హత ఉన్నప్పటికీ ప్రభుత్వము కొత్త పింఛన్లు నమోదుకు అవకాశం ఇవ్వడం లేదు. కాబట్టి ఇప్పటికైనా సంబంధిత అధికారులు తప్పును సరిచేసి తనకు మృతి చెందిన భర్త స్థానంలో వితంతు పింఛన్ కు ఎంపిక చేసి ఇవ్వాలని రాజమ్మ వేడుకుంటున్నది.

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ నేషనల్ ప్రతిభా అవార్డు అందుకున్న కొర్రపోలు రామలింగం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: నంద్యాల పట్టణానికి చెందిన శ్రీ గురురాజా ఇంగ్లీష్ మీడియం పాఠశాల కోఆర్డినేటర్ కొర్రపోలు రామలింగం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ నేషనల్ ప్రతిభా అవార్డును అందుకున్నారు. సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ సంస్థ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ నేషనల్ ప్రతిభా అవార్డుకు ఎంపిక చేయగా గుంటూరులోని లాంచలపతి ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ నేషనల్ ప్రతిభా అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం జరిగింది. విజయవాడ సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్, కెవిఆర్ జయలక్ష్మి ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అవార్డు అందించారు. ఈ కార్యక్రమానికి సభ అధ్యక్షులుగా ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు, ప్రత్యేక ఆహ్వానితులుగా డాక్టర్ కె.మోజస్, పి.రాణి అమృత వర్షిణి, డాక్టర్ కన్నా మాస్టర్, కాటూరి వెంకటేశ్వరరావు, జిపి రెడ్డి, ఎండి మున్ను, మస్తాన్ రావ్, ఎంజివి రవీంద్రనాథ్, మాధవీలత, తదితరులు పాల్గొని ప్రసంగించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ నేషనల్ ప్రతిభా అవార్డు అందుకున్న పాఠశాల కోఆర్డినేటర్ కుర్రపోలు రామలింగంను గురురాజా ఇంగ్లీష్ మీడియం పాఠశాల డైరెక్టర్ పెద్దిరెడ్డి షేక్షావలిరెడ్డితో పాటు ఉపాధ్యాయుల బృందం ప్రత్యేకంగా అభినందించారు.

వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తే ఆరోగ్యం పదిలం

విశాలాంధ్ర - రుద్రవరం: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రతను పాటిస్తే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని వైద్యాధికారి బాబు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఏర్పాటు చేసే భోజనాన్ని పాఠశాల పరిసరాలను విద్యార్థులకు వైద్య పరీక్షలను చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటిస్తే ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం ఆయన స్థానిక ఒకటవ సచివాలయంలో ఏర్పాటు చేసిన ఫ్యామిలీ ప్రోగ్రాములో పాల్గొని గ్రామస్తులకు వైద్య సేవలను అందించారు. ఈయన వెంట పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మీదేవి వైద్య సిబ్బంది ఉన్నారు.

మండలంలో 90శాతం పింఛన్‌లు పంపిణీ

విశాలాంధ్ర - రుద్రవరం: మండలంలోని ఆయా గ్రామాలలో పెన్షన్ లబ్ధిదారులకు 90శాతం పెన్షన్లను పంపిణీ చేయడం జరిగిందని ఎంపీడీవో భాగ్యలక్ష్మి తెలిపారు. సోమవారం కోటకొండ, ఎల్లా వత్తుల, చిన్న కంబలూరు గ్రామ సచివాలయాలలో ఎంపీడీవో భాగ్యలక్ష్మి పర్యటించి లబ్ధిదారులకు పింఛన్‌లు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రుద్రవరం మండలంలో మొత్తం పింఛన్‌లు 6170 గాను ఇప్పటివరకు 5529 పెన్షన్లు పంపిణీ చేయడం జరిగిందని ఇంకా లబ్ధిదారులకు పింఛన్‌లు పంపిణీ కొనసాగుతున్నట్లు తెలిపారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

జిల్లా వైద్యాధికారులపై తీసుకోవాలి : ఏఐవైఎఫ్

విశాలాంధ్ర - కర్నూలు : ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ధనార్జన ధ్యేయంగా ఇష్టారాజ్యంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతూ రక్షా హాస్పిటల్‌పై చర్యలు తీసుకోవడంలో విఫలమైన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, నగర కార్యదర్శి బీసన్నలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూలై నెలలో కొత్త బస్టాండ్ దగ్గర ఉన్న రక్షా హాస్పిటల్‌లో లింగ నిర్ధారణ పరీక్షల చేయడం వల్ల ఆర్ఎంపి డాక్టర్ అబార్షన్ చేయడం వలన నిండు చూలాలు ప్రాణాలు కోల్పోతే దాదాపు 40 రోజులైనా లింగ నిర్ధారణ పరీక్ష చేసిన రక్షా హాస్పిటల్‌పై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదని వారు ప్రశ్నించారు. కర్నూలు నడిబొడ్డున ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతులు లేకుండా ఏంహెచ్ హాస్పిటల్ పేరుతో గత కొన్ని ఏళ్లుగా వైద్య పరీక్షలు సర్జరీలు చేస్తున్నారని వీటి పైన చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్‌ఓకి రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ, ప్రైవేట్ హాస్పిటల్‌కి కొమ్ము కాస్తున్న వైద్యాధికారులపై చట్ట పరమైన చర్యలు తీసుకోవడంతోపాటు లింగ నిర్ధారణ చేసిన రక్షా హాస్పిటల్ గుర్తింపు రద్దుచేసి, హాస్పిటల్ యాజమాన్యంపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్ఆర్ పేటలోని సిరి నోబుల్ హాస్పిటల్ వైద్యుల నిర్లక్ష్యం వల్ల ఒక మహిళ మృతి చెందిందని, ఆ మృతిపైనా సమగ్ర విచారణ జరిపించి, నిర్లక్ష్యం వహించిన డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉల్లికి గిట్టుబాటు ధర కల్పించకపోతే ఆత్మహత్యలే శరణ్యం

- ఉల్లి రైతులను ఆదుకోవాలని ఉరి తాళ్లులతో నిరసన
- రూ.3 వేల మద్దతు ధర ప్రకటించాలి
- ఏపీ రైతు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు పి.రామచంద్రయ్య

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు: ఉల్లి రైతుకు జిల్లాలో ధర కల్పించాలని, ధర కల్పించకపోతే ఉల్లి రైతులు ఆత్మహత్యలే శరణ్యమని ఏపీ రైతు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు పి.రామచంద్రయ్య అన్నారు. సోమవారం ఉల్లి రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో మండల కార్యాలయం నుండి సోమప్ప సర్కిల్ వరకు ర్యాలీగా చేపట్టి అనంతరం సర్కిల్ నందు ఉల్లి రైతులు ఉరితాలను గొంతులోకి వేసుకుని నిరసన కార్యక్రమం చేపడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఏపీ రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పి.రామచంద్రయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో ఖరీఫ్ సీజన్ లో ముందస్తు వర్షాలతో 16,557 హెక్టార్లలో ఉల్లి పంటను సాగు చేయడం జరిగిందని, పంట చేతికొచ్చేసరికి కనీసం మద్దతు ధర లేకపోవడం దుర్మార్గమని ఆయన తెలిపారు. ఉల్లి పంటను కర్నూలు మార్కెట్‌కు తీసుకురాగా కొనుగోలు చేసేందుకు వచ్చిన వ్యాపారులు ఉల్లిని చూసి క్వింటాలకు రూ.200 కొనక పోవడంతో రైతులు మార్కెట్లోనే పంటను వదిలి వెళ్లి పోవాల్సిన దుస్థితి నెలకుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మరి కొంతమంది రైతులు గిట్టుబాటు ధర లేక ఉల్లి పంటను పొలంలోనే పశువులకు మేతగా వదిలేయడం జరిగిందని తెలిపారు. కూటమి ప్రభుత్వ మాత్రం ఉల్లి రైతులను ఆదుకుంటామని నమ్మబలికి క్వింటానికి రూ 1200 మద్దతు ప్రకటించడం చాలా విడ్డూరంగా ఉందని, ఉల్లి పంట ఎకరాకు లక్ష నుండి లక్ష 30 వేల వరకు పెట్టుబడి పెట్టిన రైతు మద్దతు ధర రూ1200 ఏమి సరిపోతుందని తక్షణమే ప్రభుత్వం క్వింటానికి రూ 3000 మద్దతు ధరను ప్రకటించాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగంలో స్వామినాథన్ సిఫారసులు అమలు చేసి, మద్దతు ధర చట్టాన్ని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంపున్న గౌడ్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జి.రంగన్న మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రధానంగా రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు అప్పుల పాలై ఆత్మహత్య చేసుకోవడం జరుగుతుందని వారు తెలిపారు. కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులు తీసుకున్న బ్యాంకు రుణాలు రద్దుచేసి, మరలా రైతులకు కొత్త రుణాలు ఇవ్వాలని వారు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తక్షణమే కూటమి ప్రభుత్వం రైతులు పండించిన అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతాంగాన్ని ఆదుకోవాలని లేనిపక్షంలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు కొనసాగిస్తామని వారు తెలిపారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కెసి జబ్బార్, మాలిక్, శాంతప్ప, రాజీవ్, దాదావలి, బజారి, మద్దిలేటి, శ్రీరాములు, గిడ్డయ్య, కారన్న, ఇస్మాయిల్, తిమ్మా గురుడు, ఆంజనేయ, షరీఫ్, విజయేంద్ర, హనుమంతు రాజు, నాగేంద్ర, ఇస్మాయిల్, ఖాజా, మల్లికార్జున గౌడ్, వీరేష్, తదితరులు పాల్గొన్నారు

కర్నూలులో..

కోడుమూరులో..

ఆస్పరిలో..

పత్తికొండలో..

పత్తికొండలో..

పెద్ద కడబూరులో..

నందవరంలో..

ఆదోని రూరల్‌లో..

ప్రజల సమస్యలను సీరియస్‌గా తీసుకోవాలి : జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ప్రజల సమస్యలను సీరియస్‌గా తీసుకోవాలని, వచ్చిన అర్జీలను నిర్ణీత గడువు లోపు నాణ్యతగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం జిల్లా కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. ప్రజల సంతృప్త స్థాయిలు పెరిగేలా అర్జీల పరిష్కారం ఉండాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అర్జీలను పరిష్కరించే సమయంలో అర్జీ దారునితో వ్యక్తిగతంగా మాట్లాడితే నాణ్యతగా పరిష్కారం ఉంటుందని సూచించారు. పిజిఆర్ఎస్ లాగిన్‌లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పీజీఆర్ఎస్ లాగిన్‌లో పరిష్కారం చేసిన అర్జీల నాణ్యతను ఆడిట్ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సిఎంఓ గ్రీవెన్స్‌లకు సంబంధించి ఆదోని సబ్ కలెక్టర్ వద్ద 12, పత్తికొండ ఆర్డీఓ వద్ద 6, కర్నూలు ఆర్డీఓ వద్ద 8, కలెక్టరేట్ ఏవో వద్ద 3, సర్వే ఏడి, హౌసింగ్ పీడీ, డిఆర్‌డిఏ పిడిల వద్ద ఒక్కొక్క దరఖాస్తు చొప్పున పెండింగ్‌లో ఉన్న వాటిని గడువు లోపు పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, స్పెషల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, హౌసింగ్ పిడి చిరంజీవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

క్లస్టర్ యూనివర్సిటీ అభివృద్ధికి పాటుపడాలి

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: ప్రతి అధ్యాపకుడు క్లస్టర్ యూనివర్సిటీ అభివృద్ధికి పాటు పడాల్సిన సమయం ఆసన్నమైందని క్లస్టర్ యూనివర్సిటీ వీసీ ఆచార్య వి.వెంకట బసవరావు అన్నారు. సోమవారం క్లస్టర్ విశ్వవిద్యాలయం అకాడమిక్, అడ్మినిస్ట్రేటివ్ సమావేశం రిజిస్ట్రార్ డాక్టర్ జి.శ్రీనివాస్ అధ్యక్షత వహించి, మూడు కాన్స్టిట్యూయంట్ కాలేజీల బోధన సిబ్బందిని సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య వి.వెంకట బసవరావు మాట్లాడుతూ కళాశాలలకు ఆటోనమస్ హోదా సాధన కోసం తీసుకోవాల్సిన వ్యూహాలపై సిబ్బందికి సమగ్రంగా సూచనలు ఇచ్చారు. ఎన్ఏఏసి అక్రిడియేషన్ కొరకు అనుసరించాల్సిన నూతన ప్రక్రియలు, క్రీడల అభివృద్ధి, ఇంటర్నల్ క్వాలిటీ అశ్యురెన్స్ సెల్ విస్తరణ, త్వరలోనే స్థాపించనున్న ఇంక్యూబేషన్ సెంటర్ గురించి వివరించారు. ప్రిన్సిపల్స్ డా.ఎం.ఇందిర శాంతి, డా.కె.వెంకట రెడ్డి, వైస్ ప్రిన్సిపల్స్ బీఆర్ ప్రసాద్ రెడ్డి, రంగా రెడ్డి, డీన్స్ అక్తర్ భాను, మహమ్మద్ వాహీజ్, నాగరాజ్ శెట్టి, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ బాలసుబ్రమణ్యం, ఫామీద, వింధ్యా వాహిని, మూడు కళాశాలల బోధనా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ ఉద్యోగులకు పాత పింఛన్ పథకం

విశాలాంధ్ర - ఆదోని రూరల్: సిపిఎస్ ఉద్యోగులకు పాత పింఛను పథకం అమలు చేయాలని కోరుతూ ఎస్టీయూ పట్టణ సమితి ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి సోమవారం పురపాలక ఉన్నత పాఠశాల ఆవరణలో నిరసన తెలిపారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎస్టీయూ రాష్ట్ర పురపాలక కన్వీనర్ వీరచంద్ర యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ నాయుడు, పట్టణ ప్రధాన కార్యదర్శి భీమరాజు మాట్లాడుతూ 2004లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సిపిఎస్ పథకం వల్ల ఉద్యోగులు, ఉపాధ్యాయులు పదవీ విరమణ అనంతరం ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. న్యాయం జరగాలంటే పాత పెన్షన్ పథకాన్ని (ఓపిఎస్) మళ్లీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా సరళీకృత ఆర్థిక విధానాల పేరుతో సిపిఎస్, జిపిఎస్, యుపిఎస్ లాంటి పథకాలను విధించారని విమర్శించారు. గత 20 ఏళ్లుగా సిపిఎస్ విధానంలో భాగంగా చాలా మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు పదవీ విరమణ అనంతరం తగిన ఆర్థిక భద్రత లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం పునరాలోచన చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోపు సిపిఎస్ పింఛన్‌పై స్పష్టత హామీ నెరవేర్చాలని, ఉద్యోగులకు సామాజిక భద్రత కల్పించి పాత పింఛను పథకాన్ని తిరిగి అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు లోక్య నాయక్, ప్రహ్లాద, ప్రసాద్,రాజా సతీష్, సుధాకర్, మారయ్య, అహ్మద్ హుసేన్, నాగేష్, శ్రీరాములు, జయరాం తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర- ఎమ్మిగనూరు రూరల్ : స్థానిక ఎమ్మెల్యే స్వగృహం నందు సోమవారం వివిధ గ్రామాలకు చెందిన ఆరుగురు బాధితులకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.6.97 లక్షల విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే జయనాగేశ్వర్ రెడ్డి పంపిణీ చేశారు. ఎమ్మిగనూరు మండలం టి.చల్లకూలూరుకు చెందిన మానసకి రూ. 61,572, కడివెళ్లకు చెందిన ఖాదర్ బాషా కుటుంబానికి రూ.40,350, చిన్న కమెల వీధికి చెందిన మహ్మద్ గౌస్‌కి రూ.94,390 మరియు ఎమ్మిగనూరుకు చెందిన ఫైజ్ అహ్మద్‌కి రూ.41,045, ఉదయ్‌కుమార్ కుటుంబానికి రూ.40 వేలు, నాగభూషణం కి రూ.60 వేల విలువైన చెక్కులు అందజేశారు. చెక్కులు తీసుకున్న బాధిత కుటుంబాలు నారా చంద్రబాబు నాయుడుకి, బీవీ జయ నాగేశ్వర్ రెడ్డికి చాలా సంతోషంగా కృతజ్ఞతలు తెలిపారు.

బలవంతపు భూసేకరణ ఆపాలి

విశాలాంధ్ర- పత్తికొండ: రాష్ట్ర ప్రభుత్వం ఆలూరు మండలం మనేకుర్తిలో పవర్ గ్రిడ్ కంపెనీ ఏర్పాటు చేసేందుకు రైతుల నుండి బలవంతపు భూసేకరణ చేయడాన్ని తక్షణమే ఆపాలని అఖిలపక్ష రైతు సంఘాల నాయకులు హనుమంతు, భూపేష్, సురేంద్ర కుమార్, చంద్రకాంత్ రెడ్డి, రంగన్నలు డిమాండ్ చేశారు. సోమవారం అఖిలపక్ష రైతు సంఘాల నాయకులు మనే కుర్తి గ్రామ రైతులతో ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవర్ గ్రిడ్ కంపెనీ ఏర్పాటు కోసం సారవంతమైన భూములను భూసేకరణ చేయడం సరైంది కాదన్నారు. కూటమి ప్రభుత్వం పవర్ గ్రిడ్ కంపెనీకి బినామీగా మారిపోయి రైతులకు తీవ్ర అన్యాయం చేస్తుందని విమర్శించారు. అనంతరం ఆర్డిఓ భరత్ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి యు.కారుమంచి, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, తుగ్గలి మండల కార్యదర్శి సుల్తాన్, రైతు సంఘాల నాయకులు గిడ్డయ్య గౌడ్, దస్తగిరి, సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్, ఎస్సైలను సస్పెండ్ చేయాలి

విశాలాంధ్ర - పెద్దకడబూరు : రైతులపై అక్రమ కేసులు బనాయిస్తున్న తహసీల్దార్, ఎస్సైలను సస్పెండ్ చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్య వర్గ సభ్యులు భాస్కర్ యాదవ్, సుదర్శన్, ఆదోని పట్టణ కార్యదర్శి వీరేష్, ఉపాధ్యక్షులు గోపాల్, మండల కార్యదర్శులు రాజు, వీరేష్ మాట్లాడుతూ మండల పరిధిలోని కల్లుకుంట గ్రామంలోని సర్వే నెంబర్ 177/1, 174 /3, 177/3, 177 /3ఏ, 177 /3బి, 177 /4 లలో ఉన్న భూమి గత నాలుగు సంవత్సరాల నుండి ఆర్ ఓ ఆర్ కేసు నడుస్తుందన్నారు. గతంలో ఉన్న ఎస్ఐ శ్రీనివాసులు సదరు సర్వే నెంబర్ల పై 145 సీఆర్పీఎస్ విధించడం జరిగిందన్నారు.అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వ, జిల్లా కలెక్టర్ దగ్గర ఉన్న ఆర్ ఓ ఆర్ కేసు నిబంధనలు పాటిస్తున్న పేద రైతులు, సిపిఐ నాయకులపైన శనివారం అక్రమంగా 145 సీఆర్పీఎస్ ఉల్లంఘించారని పెద్దకడబూరు తహసీల్దార్, ఎస్సై నిరంజన్ రెడ్డి పెత్తందార్లకు సహకరిస్తూ పేద రైతులపై, నాయకులపైన అక్రమంగా కేసులు పెట్టడం సిగ్గు చేటన్నారు. పొలంలోకి వెళ్లి చూస్తే వాస్తవాలు తెలుస్తాయని, మేము తప్పు చేస్తే ఏ శిక్ష వేసినా శిరసావహిస్తామన్నారు. ఎలాంటి విచారణ చేయకుండా అక్రమంగా కేసులు పెట్టడం దారుణమన్నారు. గతంలో ఎస్ఐ తహసీల్దార్ కార్యాలయంలో పేపర్లు, ఫర్నీచర్‌లు కింద పడేసి ఎలాంటి విచారణ చేయకుండా సిపిఐ నాయకులపై కేసులు పెట్టడం జరిగిందన్నారు. ముడుపులు ఎవరిస్తే వారికే ఎస్ఐ న్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఎస్పీ స్పందించి తహసీల్దార్, ఎస్సై లపై చర్యలు తీసుకొని పేద రైతులకు న్యాయం చేయాలని, లేని పక్షంలో ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి కుమ్మరి చంద్ర, సభ్యులు రాజు, ఏఐవైఎఫ్ తాలూకా అధ్యక్షులు జాఫర్ పటేల్, నాయకులు గోపాల్, నాగేష్, నర్సింహులు, తిక్కన్న, ఇస్మాయిల్, ఇర్ఫాన్ పటేల్, డోలు హనుమంతు, రామాంజనేయులు, గిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

కైరుప్పల పాఠశాలలో కుళ్లిన కోడిగుడ్లు

విశాలాంధ్ర - ఆస్పరి : మండల పరిధిలోని కైరుప్పల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు కుళ్లిన కోడిగుడ్లు అందజేస్తుండటంతో ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం పాఠశాలల్లో రెండు నెలలుగా నిల్వ ఉంచిన కోడిగుడ్లను చూసి ఏఐఎస్ఎఫ్ నాయకులు బయటకు తీసుకువచ్చి పగలగొట్టారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి రమేష్, ఏఐఎస్ఎఫ్ మండల కోశాధికారి వీరాంజనేయులు, ఉప సర్పంచ్ వెంకటేష్ లు మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం కోడిగుడ్లను సరఫరా చేస్తుందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లింగన్న నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులకు రోజు ఇవ్వాల్సిన కోడిగుడ్లు ఇవ్వకుండా రెండు నెలలు పాఠశాలల్లో పెట్టి కుళ్ళి చెడిపోయిన కోడిగుడ్లను విద్యార్థులకు ఇస్తూ వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. నిల్వ ఉంచిన గుడ్ల నుండి దుర్వాసన వస్తున్న ఏమి పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల సహాయ కార్యదర్శి వీరేష్, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ మండల సహాయ కార్యదర్శులు సురేష్, రాఘవేంద్ర, ఎఐటియుసి నాయకులు పరమేష్, శ్రీనివాసులు, బాలు, హుసేని, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

విశాలాంధ్ర-గూడూరు: ఈ నెల 26న కర్నూలు బళ్లారి హైవే కె.నాగలాపురం పరిధిలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తికి తీవ్ర గాయాలై సోమవారం చికిత్స పొందుతూ మృతి చెందారు. కె.నాగలాపురం పోలీసుల వివరాల ప్రకారం ఈనెల 26న గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురికాగా తీవ్ర గాయాలతో కొట్టిమిట్టాడుతున్న వ్యక్తిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి తరలించి, చికిత్స చేశారు. సోమవారం అతను కోలుకోలేక మృతి చెందినట్లు తెలిపారు. మృతి చెందిన వ్యక్తి గీతలు, చొక్కా నల్ల పాయింట్ వేసుకున్నట్లు తెలిపారు.

ప్రజా సమస్యలకు సత్వరమే పరిష్కారం

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : నగర ప్రజలు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా తెలుపుతున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని నగరపాలక సంస్థ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 17 అర్జీలు వచ్చాయి. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎస్ఈ శేషసాయి, ఎంఈ మనోహర్ రెడ్డి, టిపిఆర్ఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లు పంపిణీ

విశాలాంధ్ర - సి.బెళగల్: మండల పరిధిలోని బ్రాహ్మణదొడ్డి గ్రామంలో సోమవారం కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పింఛన్ దారులకు అంద జేశారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికి గ్రామంలోని ఆహ్వానించారు. ఎమ్మెల్యే గ్రామంలో లబ్ధిదారులతో మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగుల పింఛన్‌లు తీసేస్తున్నారనే అసత్య ప్రచారాలను ఎవరు నమ్మవద్దు అన్నారు. మండల అధ్యక్షులు చంద్ర శేఖర్, సొసైటీ చైర్మన్ చిన్న తిమ్మప్ప, టిడిపి నాయకులు బాబు, పెద్ద లక్ష్మన్న పాల్గొన్నారు.

నగరపాలకలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు

విశాలాంధ్ర - కర్నూలు సిటీ: నగరపాలక సంస్థ కార్యాలయానికి వచ్చే ప్రజలకు సహాయం ఉండేందుకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు నగరపాలక సంస్థ మేనేజర్ ఎన్.చిన్నరాముడు తెలిపారు. సోమవారం ఆయన హెల్ప్ డెస్క్ సిబ్బందికి సూచనలు చేశారు. కార్యాలయానికి వచ్చే ప్రజలకు మర్యాదపూర్వకంగా సమాధానం ఇవ్వాలని, వారు అడిగిన సమాచారాన్ని స్పష్టంగా తెలియజేయాలని తెలిపారు.

ఎస్వీఎస్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు

విశాలాంధ్ర-గూడూరు: నగర పంచాయతీలోని ఎస్ఎస్‌వి కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం కళాశాలలో నిర్వహించిన ప్రెసిడెంట్ వేడుకలకు ముఖ్య అతిథులుగా మాజీ జెడ్పిటిసిఎల్ వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ సోమ గోపాల్, పోలీస్ వెంకటేశ్వర్లు హాజరయ్యారు. కళాశాల చైర్మన్, వైస్ చైర్మన్ ఇ.ఈశ్వరప్ప, కరస్పాండెంట్ వెంకటరమణ, కళాశాల ఈసీ, డిగ్రీ ప్రిన్సిపాల్ బాబురావు, ఇంటర్ ప్రిన్సిపల్ రామచంద్ర పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుంది : మంత్రి టీజీ భరత్

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: రైతులకు ఎల్లప్పుడూ అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని ఉల్లి రైతులతో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టీజీ భరత్ అన్నారు. సోమవారం మంత్రి టీజీ భరత్ కర్నూలు మార్కెట్ యార్డ్‌లో ఉల్లి రైతులు తీసుకొచ్చిన దిగుబడులను పరిశీలించి, వారితో మాట్లాడారు. ఓర్వకల్లు మండలం ఉప్పలపాడు గ్రామస్తులు ఆంజనేయులు, ఎమ్మిగనూరు మండలం ఎర్రకోట గ్రామస్తులు చిన్న నరసన్న, గోనెగండ్ల మండలం ఆల్వాల్ గ్రామస్తులు రామాంజనేయులు మొదలగు రైతులతో వారు పండించిన ఉల్లిని పరిశీలించి వారితో వారి దిగుబడులు ఏ విధంగా వచ్చినది అడిగి తెలుసుకున్నారు వారు ఎంత ఖర్చు పెడితే ఎంత ఉల్లి దిగుబడి వచ్చినది వివరంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ అధిక వర్షాల వల్ల పంట నష్టం చాలా ఉన్నదని, దిగుబడి తగ్గిపోయినదని కావున మంత్రి, రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇంకా సాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ వారితో మాట్లాడుతూ గత మూడు రోజులుగా రైతులు తమ ఉల్లి పంటను కర్నూలు మార్కెట్ యార్డుకు తీసుకు రావడం, వారు పడుతున్న ఇబ్బందులను గమనించడం జరిగిందని వెంటనే అధికారులతో మాట్లాడి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి ఈ విషయం తీసుకుని వెళ్లడం జరిగిందని తెలిపారు. ఈ కూటమి ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులకు అండగా నిలబడాలని నిశ్చయించినదని తెలిపారు. చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని క్వింటాలుకు రూ.1200 చొప్పున మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని, ఆదేశించి సోమవారం నుండి కొనుగోలు ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులు ఇబ్బంది పడకూడదని, నష్ట పోకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం స్వతహాగా ముందుకు వచ్చి కేజీ రూ.12 చొప్పున కొనడానికి నిశ్చయించి, సోమవారం నుండి కొనుగోలు ప్రారంభించిందని రైతులకు తెలియజేశారు. ఇలాంటి మంచి పనులు చేయడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎల్లప్పుడూ ముందు వరుసలో ఉంటారని, ఇది కేవలం ఆయనకే సాధ్యం అని మంత్రి టీజీ భరత్ రైతులకు తెలియజేశారు. రైతులు తమ ఉత్పత్తులను అమ్ముకోటానికి అధికారులతో సహకరించాలని, మెత్తబడిన ఉల్లిని వేరు చేయాలని కోరారు. రైతులు తమ ఆధార్ కార్డును, బ్యాంక్ అకౌంట్ నంబరు, ఈపాస్ రిసిప్ట్ మొదలగునవి అధికారులకు ఇచ్చినట్లు అయితే ఒక వారం లోపల మీ ఉల్లి డబ్బులు మీ బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయబడుతాయని కావున రైతులు సహకరించాలని మంత్రి కోరారు. కడప జేడీ మార్కెటింగ్ రామాంజనేయులు, డిప్యూటీ డైరెక్టర్ లావణ్య, కర్నూలు మార్కెటింగ్ ఏడి నారాయణ మూర్తి, మార్కెట్ యార్డ్ సెక్రటరీ జయలక్ష్మి, మార్కెట్ యార్డ్ చైర్మన్ గోల్కొండ హజ్మత్ బీ, వైస్ చైర్మన్ శేషగిరి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు, కార్పొరేటర్ పరమేష్ పాల్గొన్నారు.

ఎస్ఎస్ ట్యాంక్ నిధుల కోసం కృషి చేస్తా

విశాలాంధ్ర - ఆదోని: యుద్ధ ప్రాతిపదికన బసాపురం ఎస్ఎస్ ట్యాంక్ మరమ్మత్తుల కోసం నిధులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ బీటీ నాయుడు అన్నారు. సోమవారం ఎమ్మెల్సీ బీటీ నాయుడు, మున్సిపల్ చైర్ పర్సన్ సిహెచ్ లోకేశ్వరి, మున్సిపల్ కమిషనర్ కృష్ణ, డీఈలు వెంకట చలపతి, రామ్మూర్తిలతో కలిసి బసాపురం ఎస్ఎస్ ట్యాంక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బీటీ నాయుడు మాట్లాడుతూ ఆదోని ప్రజల దాహార్తిని తీర్చే ట్యాంకు శిథిలావస్థకు చేరడం చూస్తుంటే రాబోవు వేసవికాలంలో నీటి ఎద్దడి తలెత్తే అవకాశాలు ఉన్నందున త్వరతగతిన విషయాన్ని సీఎం చంద్రబాబు నాయుడు, జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్లి నిధులు తెచ్చేందుకు కృషి చేస్తానన్నారు. మరమ్మత్తుల కోసం అధికారులు రూ.70 నుండి రూ.90 కోట్లు అవసరం ఉందని అధికారులు ప్రతిపాదనలు పెట్టడం జరిగిందని, బసాపురం ఎస్ఎస్ ట్యాంక్‌లో ఉన్న పరిస్థితి గురించి జిల్లా ఇన్చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్లి ట్యాంకు పరిశీలనకు పిలుస్తానన్నారు. ఎంతో చరిత్ర కలిగిన ఆదోనికి నీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు శాయశక్తుల కృషిచేసి నిధులు తీసుకొచ్చి ట్యాంకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజు స్వామి, కుమారస్వామి, గోపి తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా బస్సులు నడపండి

విశాలాంధ్ర - హొళగుంద: ఆదోని డిపో నుండి సక్రమంగా బస్సు నడపాలని విద్యార్థులు సోమవారం తహసీల్దార్ నిజాముద్దీన్‌కు వినతి పత్రాన్ని ఇచ్చారు. ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ఉదయం 9 గంటలకే ప్రారంభమవుతుందని, బస్సులు సమయానికి తగ్గట్టు రాకుండా ఆలస్యంగా నడపడంతో కాలేజీకి సమయానికి సక్రమంగా హాజరు కాలేకపోతున్నామని విద్యార్థులు తెలిపారు. ఆలూరు, సులువాయి మీదుగా హొళగుందాకు, ఆలూరు వయా ఎల్లార్తి, చిన్నహేట హొళగుంద, ఆదోని వయా హెబ్బటం, హొళగుందకు రోజు తిరిగే బస్సులుఆలస్యంగ నడుస్తుండటం వల్ల తీవ్ర ఇబ్బంది పడుతున్నామని విద్యార్థులు వాపోయారు. ఉదయం 9 గంటలకి కాలేజీకి హాజరయ్యేలా బస్సు నడవాలని సాయంత్రం 5 గంటలకు గ్రామాలకు వెళ్లడానికి బస్సులను వేళకు సక్రమంగా నడిచేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు తహసీల్దార్‌కు, డిపో మేనేజర్‌కు విజ్ఞప్తి చేశారు. సాయంత్రం బస్సులు సక్రమంగా లేక రాత్రి వేళల్లో 8 గంటలకు ఇంటికి చేరుకుంటున్నామని, దీనివల్ల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ప్రిన్సిపాల్ కె.ప్రవీణ మాట్లాడుతూ విద్యార్థులు ఇచ్చిన వినతి పత్రాన్ని డిపో మేనేజర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యను వివరించాలని, బస్సును వేళకు సక్రమంగా నడిపితే విద్యార్థుల కష్టాలు తీరుతాయని, విద్యార్థులకు విద్యాబోధన సక్రమంగా అందుతుందన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో...

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, మంగళవారం 02, సెప్టెంబర్ 2025

రాష్ట్ర అభివృద్దే సీఎం చంద్రబాబు ధ్యేయం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: రాష్ట్ర అభివృద్దే సీఎం చంద్రబాబు ధ్యేయమని, ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు సాటిలేరని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్ అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు సుదీర్ఘ రాజకీయ జీవితంలో ప్రజా సంక్షేమం, అభివృద్దే ధ్యేయంగా రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. సోమవారం నంద్యాల పట్టణం పద్మావతినగర్ లోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎంగా చంద్రబాబు 30 ఏళ్ల క్రితం ఇదే రోజు సీఎం అయ్యారని, ముప్పై ఏళ్లలో చంద్రబాబు తెచ్చిన అనేక సంక్షేమ కార్యక్రమాలు, పథకాలు దేశంలో సంచలనమయ్యాయన్నారు. ప్రజల వద్దకే పాలన పేరుతో జన్మభూమి కార్యక్రమం, పట్టణ ప్రాంతాలకు వచ్చిన పేద ప్రజలకు పట్టెడన్నం పెట్టాలనే ఉద్దేశంతో పది రూపాయలకే భోజనం కింద అన్నాక్యాంటీన్లు తేవడం, పీపీ విధానంలో నేషనల్ హైవేలు, గ్రామ గ్రామానికి రోడ్లు వేశారన్నారు. రాష్ట్రంలో పేదరికం ఉండకూడదని, పేదరిక నిర్మూలన కోసం పీ4 పథకం తెచ్చారన్నారు. గత ప్రభుత్వంలో అన్న క్యాంటిన్లు ధ్వంసం చేస్తే మళ్లీ చంద్రబాబు నాయుడు అన్న క్యాంటిన్లను పునరుద్దరించారని, రూ.10 లకే కడుపు నిండా భోజనం పెడుతున్నారని గుర్తు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఐటికి ప్రాధాన్యతనిచ్చి హైటెక్ సిటీ నిర్మాణం చేపట్టిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. విజన్ 2020 పేరుతో పాలనకు కొత్త రూపురేఖలు తీసుకొచ్చాడని, విద్యారంగంలో మార్పులు తెచ్చి టీచర్ల నియామకాలు చేపట్టడంతో పాటు నాలెడ్జి ఎకానమికినాంది పలికారన్నారు. రాష్ట్రంలో పాలన పారదర్శకంగా సాగడం కోసం రియల్ టైం గవర్నెన్స్ని తీసుకొచ్చాడన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు అమలు చేశారని, సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసి చూపించారన్నారు.

మూడు దశాబ్దాల దూరదృష్టి, అభివృద్ధి, సంక్షేమ యాత్ర

విశాలాంధ్ర - ఆదోని: నేటితో కచ్చితంగా 30 ఏళ్ల కిందట తొలిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నారా చంద్రబాబు నాయుడు సేవలు, సంస్కరణలు, అభి వృద్ధి కార్యక్రమాలు నేటికీ ప్రజలకు ఆదర్శంగా నిలుస్తు న్నాయని ఎమ్మెల్సీ బీటీ నాయుడు అన్నారు. సోమవారం ఎమ్మెల్సీ బీటీ నాయుడు విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా పని చేసిన ఈ మూడు దశాబ్దాల కాలం, ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఒక మైలురాయని, ప్రజల వద్దకు పాలన తీసుకెళ్లిన నాయకుడిగా, సంస్కరణలకు నాంది పలికిన దూరదృష్టి గల నేతగా ఆయన ఎల్లప్పుడూ గుర్తింపు పొందాయని, ప్రవేశపెట్టిన అనేక పథకాలు, కార్య క్రమాలు సమాజంలోని ప్రతి వర్గానికి చేరాయని అన్నా రు. జన్మభూమి, క్లీన్ అండ్ గ్రీన్, దీపం, ఆదరణ, డ్వాక్రా వంటి కార్యక్రమాలు ప్రజల భాగస్వామ్యాన్ని పెంచి మహిళలకు, బిసిలకు రిజర్వేషన్లు, మైనారిటీలకు ప్రత్యేక పథకాలు, ఎస్సీల కోసం పున్నయ్య కమిషన్ సిఫార్సుల అమలు, దళితుల వర్గీకరణ వంటి నిర్ణయాలు సామాజిక న్యాయానికి పునాది వేశాయని గుర్తు చేశారు. రాష్ట్ర ఆర్థిక, పారిశ్రామిక, సాంకేతిక అభివృద్ధికి ఆయన చేసిన కృషి అమూల్యం. విద్యుత్ రంగ సంస్కరణలు, ప్రైవేట్ రంగంలో తొలి విమానాశ్రయం, టెలికాం రంగంలో కీలక సూచనలు, నేషనల్ హైవేలు, గ్రామీణ రహదారుల విస్తరణ, ఇవన్నీ ఆయన విజనరీ లీడర్‌షిప్ కు నిదర్శనమని అన్నారు. హైటెక్ సిటీ నిర్మాణం, విజన్ 2020, నాలెడ్జ్ ఎకానమీ ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను ఐటీ మ్యాప్ పై నిలిపారు. ప్రతి జిల్లాలో మెడికల్ కాలేజీలు, పెద్ద ఎత్తున ఇంజనీరింగ్ కాలేజీల స్థాపన, లక్షలాది మంది ఉపాధ్యాయుల నియామకం వంటి నిర్ణయాలు విద్యా, వైద్య రంగాలను విస్తృతంగా అభివృద్ధి చేశాయి అన్నారు. రైతుల కోసం తొలిసారి డ్రిప్ ఇరిగేషన్ టెక్నాలజీ, సాగునీటి ప్రాజెక్టులు, యాంత్రీకరణ, సబ్సిడీలతో అన్నదాతకు అండగా నిలిచారు. నదుల అనుసంధానం, పేదరిక నిర్మూలన కార్యక్రమాలు, అన్నా క్యాంటీన్లు, స్వచ్ఛభారత్, డిజిటల్ కరెన్సీ కమిటీ, రియల్ టైం గవర్నెన్స్, అమరావతి నిర్మాణం వంటి నిర్ణయాలు ఆయన ఆధునిక ఆలోచనలను ప్రతిబింబిస్తాయనీ అన్నారు. ఈ 30 సంవత్సరాల ప్రయాణం, అభివృద్ధి, సంక్షేమం, పారదర్శక పాలనల సమన్వయంతో నడిచిందని అన్నారు. చంద్రబాబు చూపించిన దారిలోనే ఆధునిక ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందనీ, సేవలు చరిత్రలో శాశ్వతంగా నిలుస్తాయి అని అన్నారు.

హరిత గార్డెన్‌ను ప్రైవేటుకరణ చేయొద్దు

విశాలాంధ్ర - ఓర్వకల్లు: మండలం హరితరాక్ గార్డెన్ ఆస్తులను ప్రైవేటీకరణ చేయడం మానుకొని, ఉద్యోగస్తులకు భద్రత కల్పించాలని సోమ వారం ఓర్వకల్లు హరిత రాక్ గార్డెన్ సిబ్బంది కలెక్టర్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపుగా 23 నుండి 25 ఏళ్లు టూరిజం సంస్థలో రెగ్యులర్గా కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగాలు నిర్వహిస్తున్నాం కరోనా మహమ్మారి సమయంలో ప్రాణాలకు తెగించి రోగులకు వైద్యులకు హాస్పటల్ సిబ్బందికి ప్రభుత్వ అధికారులకు, పోలీసుకు కలెక్టర్ ఆశయశాల మేరకు భోజనాలు అందించడం జరిగింది. ఆ సమయంలో కరోనాసోకి కొంతమంది మా సిబ్బంది చనిపోవడం కూడా జరిగింది. జీవో నెంబర్ 23 ద్వారా 33 సంవత్సరములకు లీజుకు అప్పజెప్పడం సరైనది కాదని మా ఉద్యోగాలకు భద్రత కల్పించాలని కలెక్టర్‌కి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాగరాజు శ్రీనివాసులు ఆనంద్ కుమార్ శేఖరు చెన్నయ్య తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు

టీబీ ముక్తా భారత్ కార్యక్రమం

విశాలాంధ్ర - ఆదోని రూరల్: మండలంలోని బసరకోడు గ్రామ పంచాయతీలో సోమవారం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్లో భాగంగా టీబీ ముక్త భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కమ్మరిచేడు పిహెచ్సి వైద్యులు డా.ఈరన్న హాజరై రోగులను ఉద్దేశించి ప్రసంగించారు. టీబి అంటువ్యాదని, ఒకరి నుండి మరొకరికి తుంపర్ల ద్వారా సంక్రమిస్తుందన్నారు. టీబి వ్యాధి ఊపిరితిత్తులను పాడు చేస్తుందని వైద్యుల సూచనల మేరకు టీబీ వ్యాధిగ్రస్తుడు కఠినమైన జాగ్రత్తలు తీసుకోక తప్పదని హెచ్చరించారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరము, బరువు తగ్గడం, ఆకలి తగ్గడం, ఉమ్మిలో రక్తం పడటం వంటి లక్షణాలు ఉన్నవారు తక్షణమే ప్రభుత్వ వైద్యశాలలో టీబీ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. ప్రస్తుతం వర్షాకాలం, శీతాకాలం దృష్టిలో ఉంచుకుని ప్రబలుతున్న సీజనల్ వ్యాధుల పట్ల బారిన పడకుండా పాటించవలసిన ముందస్తు జాగ్రత్తల గురించి క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో టీబి సూపర్వైజర్ గోపాల్, హెల్త్ సూపర్వైజర్ భాగ్యలక్ష్మి, సిహెచ్ఓ, ఎంఎల్ హెచ్పి సిసింద్రీ, ఏఎన్ఎం విద్యావతి, ల్యాబ్ సూపర్వైజర్ జీవిత, ఆశా కార్యకర్తలు గీత, మీనాక్షి, మహాలక్ష్మి అంగన్వాడి ఉపాధ్యాయులు,స్థానిక నాయకుడు అసెన్ పీరా వ్యాధిగ్రస్తులు,ప్రజలు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయం సమస్యను పరిష్కరించాలి



విశాలాంధ్ర - హొళగుంద: మండలంలోని కోగిల తోట గ్రామ సచివాలయం భవనం సమస్యను వెంటనే పరిష్కరించాలని జిల్లా పరిషత్ హై స్కూల్ చైర్మన్ బసవరాజు, గ్రామ పెద్దలు వీరాంజిని, బసవ, గోవర్ధన్, దేవన్నలు, టిడిపి మండల కన్వీనర్ వీరన్న గౌడ్ సోమవారం ఎంపీడీవో విజయ లలితను కలిసి డిమాండ్ చేశారు. వారితోపాటు వైసీపీ నాయకులు ఈసా, శేషప్ప, నాగప్పతో పాటు హెడ్మాస్టర్ చిన్న లాల్ స్వామి, ఉపాధ్యాయుడు పుల్లన్న, డిప్యూటీ ఎంపీడీవో చక్రవర్తి, గ్రామ కార్యదర్శులు నాగరాజ్, రంగస్వామి హాజరయ్యారు. హెడ్మాస్టర్ చిన్న లాల్ స్వామి మాట్లాడుతూ గ్రామ సచివాలయం భవనం తమకు అప్పగించాలంటూ కోర్టు ఆదేశించిందని గ్రామ సచివాలయం భవనం కేటాయిస్తే విద్యార్థుల విద్యార్థులకు ఎంతో అనుకూలమవుతుందని అన్నారు. గ్రామ సచివాలయం భవనం పంచాయతీ ఆధీనంలో తీసుకుంటే రాతపూర్వకంగా సంబంధిత అధికారులు తమకు రాసి ఇస్తే ఉన్నతాధికారులు అడిగితే రాతపూర్వక ఇచ్చిన కాయితాన్ని చూపిస్తామని స్పష్టం చేశారు. ఇరువురు గ్రామ సచివాలయం భవనం తమదంటే తమదంటూ ఎంపీడీవో ముందు వాగ్వాదం చేశారు. బిల్లులు పడలేదని తాము నష్టాల్లో ఉన్నామని సచివాలయం భవనం పంచాయతీ ఆధీనంలోకి వస్తుందంటూ కొందరు వాదించారు. ఏదైనా సరే మాకు సమస్యను పరిష్కరించి గ్రామ సచివాలయం భవనంఎ శాఖకు వస్తుందో తేల్చి చెప్పా లని చైర్మన్, గ్రామ పెద్దలు, హెడ్మాస్టర్, ఉపాధ్యాయుడు గట్టిగా అడిగారు. ఎంపీడీవో విజయ లలిత మాట్లాడుతూ గ్రామ సమస్యను సామరస్యంతో కూర్చొని పరిష్కరించుకోవాలని కోరారు. హై స్కూల్, గ్రామ సచివాలయం సరైన కాగితాలను చూసి సర్వేయర్ ద్వారా కొలిచి ఏ స్థలంలో అది వస్తుందో వారికి కేటాయిస్తామని రెండు మూడు రోజుల్లో సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని సమాధానం ఇచ్చారు. జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తా మని అన్నారు.

మండలంలో 90శాతం పింఛన్‌లు పంపిణీ

విశాలాంధ్ర - పాములపాడు: మండలంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని మండలంలోని 13 గ్రామపంచాయతీలో సోమవారం నిర్వహించారు. ఈ పింఛన్ల కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్ తుమ్మలూరు, రుద్రారం గ్రామంలో పాల్గొనగా మండల ప్రత్యేక అధికారి ఎంవిఎన్ రాజు పాములపాడు, జూటూరు గ్రామపంచాయతీలో పాల్గొని పింఛన్లను పంపిణీ చేశారు. మండలంలో మొత్తం 5718 పింఛన్దారులు ఉండగా వారికి రూ.2,41,78,500 మంజూరు కాగా, సోమవారం నా 5171 మంది పింఛన్ దారులకు 2,17,21,500 రూపాయలు పంపిణీ చేసి మండలం మొత్తం 90.43% పంపిణీ జరిగిందని వారు తెలిపారు. మిగతా పింఛన్దారులకు రెండు రోజుల్లో పంపిణీ చేస్తామని వారు తెలిపారు. ఈ పంపిణీ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులు, విఆర్ఓలు పాల్గొన్నారు.

రైయిన్‌బో పాఠశాలను సిజ్ చేయాలి

విశాలాంధ్ర - నందవరం: ఈ సందర్భంగా విద్యార్థి సంఘ నాయకులు జేఏసీ చైర్మన్ కోనేటి వెంకటేశ్వర్లు ఆర్‌యూఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథ్, ఆర్‌పిఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి షాహిద్ అఫ్రిది, బీసీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పగడాల ఆనంద్ బాబు మాట్లాడుతూ నందవరం మండలంలో ఉన్నటువంటి రైన్బో పాఠశాలలో ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలను నడుపుతున్నారు అని పాఠశాల మీద నుండి హై పవర్ మెయిన్ విద్యుత్ తీగలు వెళ్లడం జరిగింది. పాఠశాల రేకుల షెడ్లలో నడపడం వలన ఆ రేకుల షెడ్లకు విద్యుత్ తీగలకు రెండు అడుగుల దూరం మాత్రమే ఉండడం జరుగుతుంది భారీ వర్షాలు వచ్చాయంటే పాఠశాల మొత్తానికి షాక్ తగిలే ప్రమాదం ఉంది ఆవేదన వ్యక్తం చేశారు. ఇరుకిరుకు గదులలో విద్యార్థులను కూర్చోబెట్టడం జరుగుతుంది అన్ని పాఠశాలలో ఫ్యాన్లు వేయకపోవడం మరుగుదొడ్ల విషయాల్లో 400కు పైగా విద్యార్థులు ఉంటే వారికీ సరిపడా మరుగుదొడ్లు లేకపోవడం జరుగుతుందని ఇవే కాకుండా పాఠశాల బస్సులకు, వ్యాన్లకు సంబంధించి పరిమితికి మించి విద్యార్థులను ఒక పశువుల లాగా ఎక్కించుకోవడం జరుగుతుంది. గత సంవత్సరం నుండి ఇదే విధంగానే మండల విద్యాధికారులకు చెబుతూ ఉన్న వారు మాత్రం నోటీసులకే పరిమితం కావడం ఆశ్చర్యకరమైనటువంటి విషయం. విద్యార్థుల తల్లిదండ్రులను దగ్గర వేలల్లో ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న రెయిన్బో పాఠశాలను సీజ్ చేసి విద్యార్థుల జీవితాలు కాపాడాలని వారు డిమాండ్ చేశారు లేనిపక్షంలో మరిన్ని ఉద్యమాలకు పూనుకుంటామని వారు హెచ్చరించారు.

కార్యకర్తను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ పట్టణంలోని సాగర్ వీధిలో బైపాస్ సర్జరీ చేసుకున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త సురేష్ గౌడ్ ను ఆళ్లగడ్డ మాజీ శాసనసభ్యులు గంగుల బ్రిజేంద్రారెడ్డి పరామర్శించారు. సురేష్ గౌడ్ బైపాస్ సర్జరీ చేయించుకున్నాడన్న వార్త తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి సోమవారం అయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అయన వెంట ఏఎన్ఆర్ హుస్సేన్ భాష, మహబూబ్ బాషా , సింగం వెంకటేశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.

ఘనంగా ఎల్ఐసీ వార్షికోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్: పట్టణంలోని ఎల్ఐసి కార్యాలయంలో ఎల్ఐసి 69వ వార్షికోత్సవ వేడుకలను బ్రాంచ్ మేనేజర్ పాండురంగ నాయక్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు ఎల్ఐసి 69వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా సెప్టెంబర్ నెల ఒకటో తేదీ నుండి ఐదవ తేదీ వరకు భీమ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ పాండురంగ నాయక్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా మున్సి పల్ కమిషనర్ రమేష్ బాబు పాల్గొని, జ్యోతి ప్రజ్వలన గావించి, ఈ బీమా వారోత్సవాలను ప్రారంభించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు మాట్లాడుతూ ప్రజల నమ్మకాన్ని చురగొన్న బీమా సంస్థ ఒక ఎల్ఐసి నేనని కొనియాడారు. అనంతరం ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ పాండురంగ నాయక్ మాట్లాడుతూ దేశీయ భీమా రంగంలో ఎన్ని కంపెనీలు ఉన్నా ప్రభుత్వ ఆధీనంలోని ఎల్ఐసి ది ప్రత్యేక స్థానం అని అన్నారు దేశవ్యాప్తంగా 688 జిల్లా స్థాయి జీవిత బీమా కార్యాలయాల్లో సుమారు 15 లక్షల మంది నిరుద్యోగులకు భీమా సహాయ సలహాదారులుగా ఉపాధి కల్పిస్తోందన్నారు అలాగే బీమా సఖియోజన పథకం ద్వారా మహిళలను బీమా సలహాదారులుగా ప్రోత్సహిస్తుందన్నారు అనంతరం ఏవోలు రఘుకుమార్ రాజశేఖర్ నాయక్ డిఓ జగన్నాథ రాజులు మాట్లాడుతూ ఎల్ఐసి సంస్థ పాలసీదారులకు విశిష్ట సేవలు అందిస్తూనే సమాజ సేవలో కూడా ముందుంటుందన్నారు ఈ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేసి గెలుపొందిన వారికి బహు మతుల ప్రధానము, స్కాలర్‌షిప్‌ల అందజేతతో పాటు ఏజెంట్లకు ప్రోత్సాహకాలు ఏజెంట్లకు ఉద్యోగులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతుల ప్రధానము వంటి పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు అనంతరం ఎల్ఐసి సాధించిన ప్రగతిని గురించి వివరించారు. ఎల్ఐసి ఎంప్లాయిస్ యూని యన్ నాయకులు రవికుమార్, నాగన్న, శోభారాణి, సుచిత్ర, ప్రవీణ, నాయకులు అబ్దుల్ కరీం, సాయిరాం, స్వామిదాసు, రాంబాబులు పాల్గొన్నారు.

బ్రాహ్మణకొట్కూరు పీఏసీఎస్ చైర్మన్‌గా హరిసర్వోత్తమ రెడ్డి



విశాలాంధ్ర - నందికొట్కూరు : రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం విషయంలో ఒక విజన్‌తో ముందుకు వెళు తున్న వ్యక్తి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య అన్నారు. మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు గ్రామంలో సింగిల్ విండో చైర్మన్ గా మద్దూరు సుబ్బారెడ్డి మనవడు మద్దూరు హరిసర్వోత్తమ రెడ్డి ప్రమాణ స్వీకారం మార్కెట్ యార్డు చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి అధ్యక్షతన అట్టహాసంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య, నందికొట్కూరు టీడీపీ ఇంచార్జ్ గౌరు వెంకట రెడ్డి, నంద్యాల పార్లమెంట్ టీడీపీ ఇంచార్జ్ మాండ్ర శివానందరెడ్డిలు హాజరయ్యారు. ముందుగా బ్రాహ్మణ కొట్టుకూరు బస్టాండ్ నుండి రాయల్ ఫంక్షన్ హాల్ వరకు పిఏసిఎస్ చైర్మన్ హరిసర్వోత్తమ రెడ్డి ముఖ్య అతిథులను భారీ ర్యాలీతో పులవర్షం కురిపిస్తూ తీసుకెళ్లారు. అనంతరం సొసైటీ సిఈఓ అశోక్ నూతన చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఎమ్మెల్యే గిత్త జయసూర్య మాట్లాడుతూ గత 20 ఏళ్ళుగా నందికొట్కూరు నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగరలేదని గౌరు, మాండ్ర ల ఆశీస్సులతో నేడు టీడీపీ పార్టీ జెండా ఎగరవేశామన్నారు. గత 15 ఏళ్ళుగా ఏ ఎమ్మెల్యే ఎమ్మెల్యేగా గెలిచినప్పటికి స్వేచ్ఛగా పని చేయలేదని, నేడు గౌరు, మాండ్ర శివానందరెడ్డిలు తనకు స్వేచ్ఛగా దళిత ఎమ్మెల్యేను అయినప్పటికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా, అన్ని విధాలుగా సహకరిస్తూ ప్రోత్సాహిస్తూ ముందుకు నడిపిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దేశంలోనే ఎక్కడలేని విధంగా ప్రజా సంక్షేమ పాలన ప్రజాలవద్దకు తీసుకెళ్తున్నారన్నారు. అన్ని వర్గాలు వారికి తగిన ప్రాధాన్యత ఇస్తూ ముందుకు నడిపిస్తున్నారని, మహిళలకు రాజకీయంగా అన్ని రకాలుగా తగిన ప్రాధాన్యత కల్పిస్తున్నారన్నారు. మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 1995లో సెప్టెంబర్ 1న మొట్టమొదటి సారిగా సీఎం గా ప్రమాణస్వీకారం చేశారని పేర్కొన్నారు. హైదరాబాద్ లో హైటెక్ సిటీ స్థాపించి అన్ని విదాలుగా అభివృద్ధి చేశారని, నేడు అమరావతిలో ఒక విజన్‌తో ముందుకు వెల్తూ అభివృద్ధి చేస్తున్నారన్నారు. అనంతరం నూతనంగా ఎందుకో పడ్డ సొసైటీ చైర్మన్ మద్దూరు హరి సర్వోత్తమ్ రెడ్డిని అధికారులు టిడిపి ముఖ్య నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి యువ నాయకులు ఉదయ్ కిరణ్ రెడ్డి, మాండ్ర సురేంద్ర నాథ్ రెడ్డి, ఖాతా రమేష్ రెడ్డి, ముత్తు జావలి, ఖాజాముద్దీన్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పని చేయని వీడియో కాన్ఫరెన్స్ సెట్

అధికారులు లేక ఖాళీ కుర్చీల దర్శనం

విశాలాంధ్ర - హొళగుంద: మండల స్థాయిలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల కేంద్రంలోని వీడియో కాన్ఫరెన్స్ సెట్ పని చేయకపోవడంతో అధికారులు లేక ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్, జిల్లాస్థాయి అధికారులు ప్రతి సోమవారం కలెక్టరేట్ భవనంలోని సునయన ఆడిటోరియంలో ప్రజా ఫిర్యాదుల సదస్సును నిర్వహించి జిల్లా ప్రజల సమస్యల దరఖాస్తులను స్వీకరించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులకు నేరుగా సమస్యను అడిగి తెలుసుకుని పరిష్కరించడానికి చొరవ చూపుతున్నారు. అయితే మండలంలో మాత్రం అధికారులు ఎండిఓ కార్యాలయంలో రాక తమ తమ సెల్‌ఫోన్‌లో లింక్ చేసుకొని సమావేశంలో పాల్గొన్నారు. ఏపీ నెట్ ఫైబర్ పనిచేయకపోవడంతో వీడియో కాన్ఫరెన్స్ ప్రారంభం కాక మూగబోయింది. అధికారులు చేసేది ఏమీ లేక ఫోన్ల ద్వారా లింక్ అయ్యారు. ఆయా శాఖల అధికారులు ఫోన్లో హాజరై జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ చేసే పనులను చెప్పే మాటలను విన్నారు. ఎండిఓ కార్యాలయంలో అధికారులు లేక కుర్చీలు ఖాళీగా దర్శనం ఇచ్చాయి. విద్యుత్ దీపాలు, ఫ్యాన్లు జోరుగా తిరగడంతో విద్యుత్తు వృధా అయిందని విద్యావంత యువకులు తెలిపారు. విద్యుత్ పొదుపు చేయాలంటూ రాష్ట్ర స్థాయి అధికారులు ఎన్నోసార్లు అధికారులకుఆదేశాలు ఇచ్చినా ఇ క్కడ అధికారులు మాత్రం పెడచెవిని పెట్టడంతో విద్యుత్తు వృధా అయిందని వాపోయారు.

విలేజ్ సర్వేయర్‌పై క్రమశిక్షణ చర్యలుకు సిఫారసు

విశాలాంధ్ర - ఆదోని: ఎమ్మిగనూరు మండలం పార్లపల్లి గ్రామంలో విలేజ్ సర్వేయర్‌గా పనిచేసి, ప్రస్తుతం ఓర్వకలు మండలం ఉయ్యాలవాడ గ్రామానికి బదిలీ అయిన వి.శ్రీనివాసులపై క్రమశిక్షణ చర్యలకు సిఫారసు చేసినట్లు సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ పార్లపల్లి గ్రామంలో విధులు నిర్వహించిన సమయంలో, రైతుల నుండి తమ పొలాలకు సర్వే చేయించుకునే సందర్భాల్లో పలుమార్లు డబ్బులు డిమాండ్ చేసి రైతుల దగ్గర నుండి డబ్బు తీసుకొని, విధులలో అవకతవకలు చేసాడని ఫిర్యాదులు అందాయని చెప్పారు. రైతుల కంప్లైంట్ మేరకు సంబంధిత అధికారులతో ప్రాథమిక విచారణ జరపగా ఆరోపణలు నిజమని తేలినందున, సంబంధిత ఉన్నత అధికారులకు క్రమ శిక్షణ చర్యలకు సిఫారసు పంపినట్లు సబ్ కలెక్టర్ వెల్లడించారు. ఆయన రైతులకు విజ్ఞప్తి చేస్తూ భూ సమస్యల పరిష్కారానికి ఎలాంటి అధికారికీ డబ్బులు ఇవ్వవలసిన అవసరం లేదని, ప్రభుత్వం ఈ సేవలను పూర్తిగా ఉచితంగా అందిస్తోందని స్పష్టం చేశారు.

ఇంటి వద్దకే వెళ్లి పింఛన్‌లను అందజేసిన కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద ఈ మాసంలో జిల్లాలో అర్హులైన 2 లక్షల 39 వేల 256 మంది పింఛన్ లబ్దిదారులకు రూ.103.88 కోట్లు పంపిణీ చేయడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. సోమవారం ఉదయం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో భాగంగా స్థానిక ఖండేరి వీధిలో జయ లక్ష్మన్న, రోహిణి కుమార్, జయరాం రెడ్డి, రంగస్వామి, చంద్రశేఖర్, శ్రీలత లకు వృద్ధాప్య పింఛన్, కాంతా మణి కి ఒంటరి మహిళ పింఛన్, అబ్దుల్ అజీద్, షఫీ ఉల్లా, సౌమ్య లకు వికలాంగుల పెన్షన్, సైక్ ఆలిమా, లక్ష్మీకాంతమ్మలకు వితంతువు పింఛన్‌లను వారి ఇంటి వద్దకే వెళ్లి జిల్లా కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా పింఛన్‌లను లబ్ధిదారులకు పంపిణీ చేస్తూ జిల్లా కలెక్టర్ వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పింఛన్ ప్రతినెల సరైన సమయానికి వచ్చి అందిస్తున్నారా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు.

ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

విశాలాంధ్ర - వెలుగోడు: రాష్ట్రంలో ఉన్న 12 లక్షల మంది ఆటో కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని కార్మికులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆటో వర్కర్స్ యూనియన్ వెలుగోడు మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తహసిల్దార్ కార్యాలయం దగ్గర సోమవారం ధర్నా నిర్వహించారు. మండల కార్యదర్శి నాగ మోహన్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.ఏసు రత్నం, ఆవాజ్ జిల్లా నాయకులు మహమ్మద్ రఫీ మాట్లాడుతూ ఆటోల ద్వారా ఉపాధి పొందుతున్న లక్షలాది మంది ఆటో డ్రైవర్ల కుటుంబాలు ఫ్రీ బస్సు వల్ల వీధిన పడుతు న్నాయని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా వాహన మిత్ర పథకం డబ్బులు పెంచి, ఆటో కార్మికుల కుటుంబాలను ఆదుకుంటామని వాగ్దానం చేసి సంవత్సరం కావస్తున్న ఆటో కార్మికుల సంక్షేమం గురించి పట్టించుకోవడం లేదని విమర్శించారు. న్యాయ సంహిత చట్టం 2023 సెక్షన్ 106-1 106-2 వల్ల ప్రమాదాలకు ఆటో కార్మికులనే బాధ్యులను చేస్తూ 10 లక్షల రూపాయలు జరిమానా 10 సంవత్సరాలు జైలు శిక్ష పడే విధంగా సెక్షన్లు తీసుకొని వచ్చారు వీటిని వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆదుకోవాల్సిన ప్రభుత్వం నేటి ప్రభుత్వ విధానాల వల్ల ఆటో కార్మికుల కుటుంబాలు చితికి పోతున్నాయి. ఆటో కార్మికుల సంక్షేమానికి ఒక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని వారు కోరారు. చట్టాలను రద్ద వాహన మిత్ర ద్వారా ఆటో డ్రైవర్ల కుటుంబానికి ప్రతినెల పదివేల రూపాయలు ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చాలీచాలని బాడుగలతో కుటుంబాలను పోషించుకుంటున్న ఆటో కార్మికుల సంక్షేమాన్ని ప్రభుత్వం పట్టించుకోవాలని ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరము వెలుగోడు మండల తహసిల్దారు శ్రీనివాసులు గౌడు కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు సుబ్రహ్మణ్యం, వలి శాలి, పైల్వాన్, మెకానిక్ రాజు, నాగన్న, గోవిందరాజు, స్వాములు, లక్ష్మణ్, మోహన్, రాజు, కృష్ణ సిఐటియు మండల నాయకులు వెంకటయ్య కిషోర్ జి.భాష రామకృష్ణ నూరుల్లా పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర - పెద్దకడబూరు : ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు ఏసేపు, నాయకులు వీరేష్ గౌడ్, మునెప్ప, బిపి ఈరన్న అన్నారు. సోమవారం మండల పరిధిలోని వివిధ గ్రామాలలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద అవ్వా తాతలకు పింఛన్లు కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఈ వారు ఇంటింటికి వెళ్లి వికలాంగులకు, వృద్ధులకు, వితంతువులకు పింఛన్లు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రతి నెలా పింఛన్లు పంపిణీ కార్యక్రమం పండుగ వాతావరణంలో జరుగుతుందని తెలిపారు.

నిరుపేదలకు వరం ఎన్టీఆర్ భరోసా పింఛన్

విశాలాంధ్ర- కోవెలకుంట్ల: నిరుపేదలకు వరం ఎన్టీఆర్ భరోసా పింఛన్ అని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం కోవెలకుంట్ల మండలలోని సంతపేట వీధిలో నూతనంగా మంజూరైన పింఛన్లను గడ్డం రామకృష్ణారెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులకు వితంతువులకు చేయూతనిచ్చి ఆదుకోవాలనే తలంపుతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతి నెల ఒకటో తేదీన క్రమం తప్పకుండా రూ.4 వేల పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. నారా చంద్రబాబు నాయుడు ప్రచార నేపథ్యంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల మేరకు ఏడాది కాలంలోనే హామీలను నెరవేర్చి అమలుపరిచి కొత్త చరిత్ర సృష్టించారన్నారు. ఆగస్టు 15 తేదీన శ్రీ శక్తి బస్సు పథకంతో మహిళలకు సంక్షేమంతో పాటు వారికి ఆర్థిక చేయూత సురక్షితమైన ప్రయాణాని కల్పించి మహిళా లోకానికి దేవుడు నారా చంద్రబాబు నాయుడు అని ఆయన అన్నారు. మంజూరైన పింఛలను నేడు అధికారులు నాయకులు పంపిణీ చేయడం జరుగుతుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీఈ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: ఫీజుల పేరుతో వేధిస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను విద్యార్థి జెఏసి నాయకులు కోనేటి వెంకటేశ్వర్లు, పగడాల ఆనంద్ బాబు, సావడి రఘునాథ్, అఫ్రిదిలు కోరారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని ఆర్టీఈ విద్యార్థుల సమస్యలు తక్షణం పరిష్కరించాలన్నారు. విద్యా హక్కు చట్టం-2009 అమలుకు రాష్ట్ర వ్యాప్తంగా పోరుబాట కార్యక్రమం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. గత మూడు సంవత్సరాల ఫీజు బకాయిలు చెల్లించడంతో పాటు, ప్రభుత్వం విద్యాసంస్థలకు ఇస్తున్న ఫీజును రూ.25 వేలకి పెంచాలన్నారు. ఆర్టీఈ విద్యార్థులకు తల్లికి వందనం పథకం వర్తింపజేయాలన్నారు. విద్యాహక్కు చట్టం కింద అడ్మిషన్ పొందిన విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి పాఠశాలల యాజమాన్యాలు వసూలు చేసిన ఫీజులు తిరిగి ఇవ్వాలని పాఠశాల మేనేజ్మెంట్లను ఆదేశించాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఈ పేరెంట్స్, విద్యార్థి, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్ర సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యం

విశాలాంధ్ర - నందవరం: రాష్ట్ర సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని టిడిపి బిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈరన్న గౌడ్, సొసైటీ చైర్మన్ గోపాల్, టిడిపి మండల అధ్యక్షులు కాశీంవలి, సోముల గూడూరు వెంకట రామిరెడ్డి, మాజీ అధ్యక్షులు భార్గవ్, ఐటీడీపీ తాలూకా అధ్యక్షులు వీరేష్ అన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లు పంపిణీలు ఆయా గ్రామాల్లో పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మాట మీద నిలబడే ప్రభుత్వం అని అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.4వేలు పింఛన్ ఇంటింటికి వెళ్లి ఇస్తున్నారని, రాష్ట్ర సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యమన్నారు. గొర్రెల సంఘం అధ్యక్షులు కొండారెడ్డి, మాజీ సర్పంచ్ బాలరాజు, వెంకటేష్ గౌడ్, కడుబూరి, మంత్రికి రాజు, పంచాయతీ సెక్రటరీ రవి, సచివాలయం సిబ్బంది అనిత, ఎంపిఈఓ ప్రశాంతి పాల్గొన్నారు.